## 8న దివ్యాంగ శిబిరం

వికారాబాద్, జూన్ 3 : దివ్యాంగుల కోసం జూన్ 9న శిబిరాన్ని బాలికల ఉన్నత పాఠశాల, కొడంగల్, వికారాబాద్ జిల్లాలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా సంక్షేమ అధికారి జయసుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వం ఏడీఐపీ పథకం కింద గుర్తించబడి అర్హత కలిగిన దివ్యాంగులకు ఉచితంగా సహాయ పరికరాలలను అందించడం కోసం బ్యాటరీ ఆపరేటెడ్ మోటరైజ్డ్ ట్రైసైకిల్స్, హ్యాండ్ ప్రొపైల్డ్ ట్రైసైకిల్స్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ వంటి సహాయక పరికరాలను సూచించడానికి ఒక రోజు శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి లబ్ధిదారుడు వైకల్య ధ్రువీకరణ పత్రం (అన్ని సహాయ & ఉపకరణాలకు కనీసం 40 శాతం వైకల్యం తప్పనిసరి), అదేవిధంగా సంబంధిత దివ్యాంగ లబ్ధిదారుడు, వారి సంరక్షకుల అన్ని వనరుల నుంచి నెలవారీ ఆదాయం రూ.22,500/– లేదా అంతకంటే తక్కువ ఉన్నట్లు చూపించే ఆదాయ రుజువు కాపీ (ప్రభుత్వ అధికారికంగా లేదా సర్పంచ్, మేయర్, ఎమ్మెల్యే, ఎంపీ లేదా బీపీఎల్ రేషన్ కార్డ్ లేదా దివ్యాంగ పెన్షన్ రుజువు ద్వారా జారీ చేయబడింది), దివ్యాంగ జన ఆధార్ కార్డు కాపీ, యూడీఐడీ (ప్రత్యేక వైకల్య గుర్తింపు) కార్డుతో శిబిరానికి హాజరు కావాల్సిందిగా ఆమె తెలిపారు. ఏదేని సమాచారం నిమిత్తం ఫోన్ నం. 8247566442ను సంప్రదించాలన్నారు.

## ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

వికారాబాద్, జూన్ 3 : ఐటీఐ కోర్సుల్లో మొదటి విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని జిల్లా కన్వీనర్, వికారాబాద్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ నరేంద్రబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కోర్సుల్లో 2025–26/27(1 సంవత్సరం మరియు 2 సంవత్సరం) విద్యా సంవత్సరానికిగాను కళాశాలలో చేరేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులందరూ https://iti.telangana.gov.inలో దరఖాస్తు చేసుకొనుటకు తేదీ 02/06/2025 నుంచి 21/06/2025 వరకు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ఆసక్తిగల పదో తరగతి, ఎనిమిదో తరగతిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9177472488/ 8555865421/9177954208లను సంప్రదించాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

## అందుబాటులో విత్తనాలు

బొంరాస్ పేట, మే 3 : మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 50 శాతం సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి పోలప్ప తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు సంబంధిత క్లస్టర్ ఏఈవోను సంప్రదించి పర్మిట్ జనరేట్ చేసుకొని విత్తనాలు తీసుకోవాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డ్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు. 30 కిలోల బ్యాగ్ ధర రూ.2137, ఒక బ్యాగ్ 2.5 ఎకరాలకు సరిపోతుందని ఏవో తెలిపారు.

## కొనసాగనున్న రెవెన్యూ సదస్సులు

పూడూరు, జూన్ 3 : రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల రెవెన్యూ అధికారి భరత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం సోమన్‌గుర్తి గ్రామంలో 25, గొంగుపల్లి గ్రామంలో 16 మొత్తం 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మంచంపల్లి, మేడిపల్లి కలాన్‌లో సదస్సులు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. 5న చింతలపల్లి, పుడుగుర్తి, మేడికొండ., 6న తురికే ఎన్కెపల్లి, కొత్తపల్లి, తిమ్మాపూర్., 9న నిజాంపేట్ మేడిపల్లి, బాకాపూర్., 10న కంకల్, కండ్లపల్లి., 11న గట్టుపల్లి, మన్నెగూడ., 12న పెద్ద ఉమ్మెత్తాల్, చనుగోముల్., 13న కిరవెల్లి, సిరిగాయిపల్లి, అంగడి చిట్టెంపల్లి., 16న రేగడి మామిడిపల్లి, పోతిరెడ్డి గూడ., 17న తిరుమలాపూర్, రాకంచెర్ల, చీలాపూర్., 18న కడుమూర్, ఎనికేపల్లి., 19న మిట్ట కంకల్, మీర్జాపూర్., 20న కుత్బుల్లాపూర్, పూడూర్ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు కొనసాగుతాయని.. ఈ సదస్సుల్లో రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన చెప్పారు.

## డీసీఎం బోల్తా

పరిగి, జూన్ 3 : మంగళవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి కొడంగల్ వైపు ఫ్యాన్‌ల లోడ్‌తో వెళ్తున్న డీసీఎం డ్రైవర్ నిద్రమత్తులో అతివేగంగా, అజాగ్రత్తగా నడిపించడంతో బహార్‌పేట్ చౌరస్తాలో వాహనం డివైడర్ అవతలి వైపుకు వెళ్లి బోల్తాపడింది. ఈ సంఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఇదే సంఘటన ఉదయం సమయంలో జరిగితే పెద్ద ప్రమాదం జరిగి ఉండేది. ఈ సంఘటన సీసీ కెమెరాల్లో రికార్డయింది.


రైతులకు రెవెన్యూ సమస్యలపై వివరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- భూభారతి రెవెన్యూ సదస్సుల ఆకస్మిక తనిఖీ

వికారాబాద్, జూన్ 3 : రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ మండలం, మున్సిపల్ పరిధిలోని ఎర్రవల్లి, ఆలంపల్లిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. భూభారతి చట్టం ద్వారా రైతులకు కావాల్సిన సేవలను అందించాలని సూచించారు. సాదా బైనామా, పీవోపీ, భూవిస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, పాసు పుస్తకాల అందజేత తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించి సమస్యల పరిష్కార దిశగా రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల నమోదు రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం పెండ్లిమడుగు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల వివరాలను తెలుసుకున్నారు. మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణాలు చేపట్టుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి చెల్లింపులపై ఆరా తీశారు. కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


మర్పల్లిలో రైతులతో మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి

## కొనుగోలు కేంద్రం గడువును పొడిగించాలి

మర్పల్లి, జూన్ 3 : జొన్నల కొనుగోలు కేంద్రం గడువును వారం రోజులపాటు పొడిగించాలని సొసైటీ చైర్మన్ ప్రవీణ్‌రెడ్డి మార్క్‌ఫెడ్ అధికారులను కోరినట్లు తెలిపారు. మర్పల్లి మార్కెట్ యార్డ్‌లో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏవో శ్రీకాంత్‌తో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మర్పల్లి మండలంతోపాటు మోమిన్‌పేట్, బంట్వారం, కోట్‌పల్లి, ధారూర్ మండలాల నుంచి జొన్నలు పెద్దఎత్తున వచ్చాయన్నారు. జొన్నల కొనుగోలు బుధవారం వరకే ఉండటంతో మరో వారం రోజులు పొడిగించాలని మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. తాండూరు నుంచి హమాలీలు, తూకం చేసే వారిని తీసుకు వచ్చి తూకం చేయించాలని అధికారులకు సూచించారు. ప్రతి మండలంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బందులు తప్పుతాయని రైతులు కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఫసియుద్దీన్, సిబ్బంది ఉన్నారు.


వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రుబియానాజ్

## టీబీ రహిత దేశంగా ఏర్పాటు చేయడమే లక్ష్యం

యాలాల, జూన్ 3 : టీబీ రహిత భారత దేశాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రుబియానాజ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అగ్గనూరు ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో జిల్లా టీబీ నియంత్రణ ప్రోగ్రాం అధికారి రవీంద్రయాదవ్‌తో కలిసి పాల్గొని మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, సాయంత్రం వేళలో జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి కాకపోవడం, చాతిలో నొప్పి మొదలైన లక్షణాలు కనిపించినట్లయితే వెంటనే టీబీ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఆరు నెలల పాటు ప్రభుత్వం అందించే ఉచిత మందుల కిట్లను ఉపయోగించడంతోపాటు పౌష్టికాహారాన్ని తీసుకున్నట్లయితే త్వరగా టీబీ తగ్గే ఆస్కారం ఉందన్నారు. పౌష్టికాహారం నిమిత్తం ఆరు నెలల పాటు ప్రతి నెల రూ.1000 వారి అకౌంట్లో జమ చేయడం జరుగుతుందన్నారు. 310 మందిని పరీక్షించి 115 మందికి టీబీ పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.


రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ బుచ్చయ్యకు దరఖాస్తులను అందజేస్తున్న గ్రామస్తులు

## మొదటి రోజు 13 దరఖాస్తులు

నవాబుపేట, జూన్ 3 : రైతుల భూ సమస్యలను పరిష్కరించాలనే సదుద్దేశంతో గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు మొదటిరోజు దాతాపూర్, నవాబుపేట గ్రామాల్లో జరిగాయి. మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సులో దాతాపూర్‌లో 10, నవాబుపేటలో 3 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ బుచ్చయ్య తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గీతా సింగ్, వైస్ చైర్మన్ మాలీస్ బల్వంత్‌రెడ్డి, నాయబ్ తహసీల్దార్ శ్రీలత, ఆర్ఐ రజితారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

## భూ సమస్యలు పరిష్కరించుకోవాలి

తాండూరు రూరల్ జూన్ 3 : భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్ అన్నారు. మంగళవారం తాండూరు మండలం ఎల్మకన్నె గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

### బండరాయిని తొలగించేందుకు కృషి

పాఠశాల ఆవరణ ఎదుట ఉన్న బండరాయిని తొలగించేందుకు కృషి చేస్తామని తాండూరు ఈఈ సత్యనారాయణ అన్నారు. మంగళవారం తాండూరు మండలం చెంగోల్ జడ్పీహెచ్ఎస్ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాల ఎదుట ఉన్న బండరాయిని పరిశీలించారు. బండరాయి తొలగింపునకు రూ.5 లక్షలు అవసరమవుతాయని వివరించారు. త్వరలోనే పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట డీఈ నాగభూషణం, స్థానిక నాయకులున్నారు.

## మహిళ మృతి

బొంరాస్‌పేట, మే 3 : దుద్యాల మండలం కుదురుమళ్ళ గ్రామానికి చెందిన పంతులు సాయమ్మ(49) హైదరాబాద్, ముంబయిలలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేది. కొన్ని రోజుల క్రితం గ్రామానికి తిరిగి వచ్చి ఇక్కడే ఉంటున్నది. ఆదివారం సాయంత్రం సమయంలో బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు నాగులకుంటలో పడినట్లు గ్రామస్తులు అనుమానిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ యాదగిరి పోలీస్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కూతురు జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

## ప్రతిపాదనలు రూపొందించాలి

**సెర్ప్ సీఈవో దివ్య రంగరాజన్**

వికారాబాద్, జూన్ 3 : పెన్షన్లకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలు, వితంతు పింఛన్ ప్రతిపాదనలు తదితర అంశాలపై సెర్ప్ సీఈవో దివ్య రంగరాజన్ జిల్లా అదనపు కలెక్టర్‌లు, డీఆర్డీవో, రెవెన్యూ భాగాలకు సంబంధించిన అధికారులతో జూమ్ సమావేశం ద్వారా సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారునుద్దేశించి మాట్లాడారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు, వృద్ధాప్య పింఛన్లకు సంబంధించి ఆర్థిక సాయం పొందేలా దరఖాస్తులను స్వీకరించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. అర్హులకు ప్రభుత్వం నుంచి పింఛన్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో కలెక్టరేట్ నుంచి డీహెచ్ సూపరింటెండెంట్‌లు వెంకటేశ్వరి, నెహమత్ అలీ, ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ మహమూద్ అలీ, డీపీఎం నర్సింహులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల స్వీకరణ

పరిగి, జూన్ 3 : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. మంగళవారం పరిగి మండలం యాబాజీగూడ, తొండపల్లి గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సదస్సులు నిర్వహించి రైతుల నుంచి భూ సంబంధిత సమస్యలపై అర్జీలు స్వీకరించడం జరుగుతుందని చెప్పారు. వాటన్నింటినీ దశలవారీగా పరిష్కరించడమే ఈ సదస్సుల ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఈ సందర్భంగా దరఖాస్తులపై రెవెన్యూ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్ రావు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.


తొండపల్లి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

# నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

**జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రెడ్డి**


ధారూరు : రైతులకు విత్తనాలను అందజేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రెడ్డి

ధారూరు, జూన్ 3 : రైతులు నాణ్యమైన విత్తనాలనే వాడాలని, మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని వికారాబాద్ జిల్లా వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రెడ్డి అన్నారు. శాస్త్రవేత్త కేవీసీ రెడ్డి, మండల వ్యవసాయశాఖాధికారి సూర్యప్రకాశ్‌తో కలిసి మంగళవారం రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ధారూరు మండల పరిధిలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలోని రైతులకు విత్తన సంచులను పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. వరిలో ఆర్ఎన్ఆర్–15048, తెలంగాణ సోనా, కందిలో ఆశ రకం, జొన్నలో పాలెం జొన్న పీవైపీఎస్–2 విత్తనాలను సరఫరా చేశారు. ఈ విత్తనాలతో రైతులు విత్తనో త్పత్తి చేసి వారివారి గ్రామాల్లో రైతులకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు ఉన్నారు.


వికారాబాద్ : రైతులకు విత్తనాలు అందిస్తున్న అధికారులు

### విత్తన స్వయం సమృద్ధి

**వికారాబాద్ :** రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా పంటల దిగుబడిని పెంచడం, విత్తన స్వయం సమృద్ధిని సాధించవచ్చని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మోమిన్‌పేట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా ఆయన విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా మోమిన్‌పేట మండలం విత్తన ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించి, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా ముందడుగు వేస్తున్నదని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పల్లవి మాట్లాడుతూ.. విత్తనాలు జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేయబడ్డాయని చెప్పారు. రైతులు ఈ విత్తనాలను ఉపయోగించి పంటలు పండించి, తదుపరి సీజన్లలో ఇతర రైతులకు విత్తనాలను అందించడం ద్వారా గ్రామస్థాయిలో విత్తన స్వయం సమృద్ధిని సాధించడమే లక్ష్యమని తెలిపారు. తదుపరి విత్తన శుద్ధి, దాని ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంతో నకిలీ విత్తనాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తగ్గించడం, నాణ్యమైన విత్తనాల వాడకం ద్వారా పంటల దిగుబడిని 10–15% వరకు పెంచే అవకాశముందని పేర్కొన్నారు. రెవెన్యూ గ్రామానికి ఒకరు చొప్పున అభ్యుదయ రైతులకు నేరుగా నాణ్యమైన వరి, కంది, జొన్న వంటి ప్రధాన పంటల విత్తనాలు పంపిణీ విత్తనాలు అందించబడతాయని మండల వ్యవసాయ అధికారి భూపతి జయశంకర్ తెలిపారు. మినీ కిట్ కోసం వ్యవసాయ విస్తరణాధికారిని సంప్రదించాలని కోరారు.

### విత్తనాల పంపిణీ

**బంట్వారం :** గ్రామాల్లో రైతులే నాణ్యమైన విత్తనాలను పండించుకోవచ్చని శాస్త్రవేత్త రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల రైతు వేదికలో ఆయన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం రైతులకిస్తున్న ఈ విత్తనాలను పండించుకోవాలని చెప్పారు. గతంలో రైతులే విత్తనాలను నిల్వ ఉంచుకొని వాడి అధిక దిగుబడులు సాధించేవారన్నారు. ఈ విధానాన్ని అనుసరిస్తే ఎలాంటి నకిలీల బెడద ఉండదని పేర్కొన్నారు.


బంట్వారం : రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త రాజేశ్‌రెడ్డి

### విత్తన శుద్ధిపై అవగాహన

**కులకచర్ల :** నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు పొందాలని కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కనకం మొగులయ్య తెలిపారు. మంగళవారం కులకచర్లలోని రైతు వేదికలో రైతులకు నాణ్యమైన విత్తనాల సాగుపై మండల వ్యవసాయ అధికారి వీరస్వామి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి కొంతమంది రైతులకు మోడల్‌గా విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయాన్ని మరింతగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నదన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించి అధిక దిగుబడులు వచ్చేలా వ్యవసాయ శాఖ ద్వారా చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ సందర్భంగా విత్తన పరిశోధన కేంద్రం రాజేంద్రనగర్ శాస్త్రవేత్త వరప్రసాద్ రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. రానున్న రెండు సంవత్సరాల్లో ప్రతి గ్రామంలో విత్తన స్వయం సమృద్ధిని సాధించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భద్రతలో దేశానికి ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ఈ కార్యక్రమం ముందుకు వెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవోలు బాబు, నిఖిత, సాయితేజ పాల్గొన్నారు. చౌడాపూర్ మండలంలో ఎంపిక చేసిన రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో పరిమళ, సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.


కులకచర్ల : విత్తనాలను అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య


కులకచర్ల : భూభారతిపై అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

# భూభారతిపై అవగాహన అవసరం

**పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి**

కులకచర్ల, జూన్ 3 : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకువచ్చిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చౌడాపూర్ మండల పరిధిలోని మల్కాపూర్, మక్తవెంకటాపూర్ గ్రామాల్లో భూభారతి సదస్సులో పాల్గొని మాట్లాడుతూ.. ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన భూభారతి చట్టంపై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులతో ముఖాముఖిలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మండలంలో ఈ నెల 11 వరకు తహసీల్దార్ ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వాహిదాఖాతూన్, ఎంపీడీవో సోమలింగం, అధికారులు పాల్గొన్నారు.

### దరఖాస్తు చేసుకోవాలి

మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భూభారతిపై పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ మనోహర్‌చక్రవర్తి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### స్లాబ్ నిర్మాణ పనులు ప్రారంభం

**పరిగి :** పరిగిలోని తహసీల్దార్ కార్యాలయ రహదారిలో రూ.3లక్షలతో చేపడుతున్న కాలువపై స్లాబ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## జేసీబీ యంత్రం సీజ్

బషీరాబాద్, జూన్ 3 : అటవీ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన జేసీబీ యంత్రాన్ని సీజ్ చేసినట్లు అటవీ శాఖ సెక్షన్ అధికారి స్నేహశ్రీ మంగళవారం తెలిపారు. గొట్టిగ రిజర్వు ఫారెస్టులో అటవీ భూమికి ఆనుకొని ఉన్న కొంతమంది పట్టాదారులు అటవీ భూమిని ఆక్రమించేందుకు జేసీబీ యంత్రంతో చదును చేస్తుంటే విషయం తెలుసుకుని సంఘటనా స్థలం వద్దకు వెళ్లి జేసీబీ యంత్రాన్ని సీజ్ చేసి తాండూరు అటవీ శాఖ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. అటవీ భూమిని ఎవరైనా ఆక్రమిస్తే పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు.


జేసీబీని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

## గోవులను అక్రమంగా తరలించొద్దు

కులకచర్ల, జూన్ 3 : గోవులను అనుమతి లేకుండా అక్రమంగా విక్రయిస్తే సహించేది లేదని బీజేపీ కులకచర్ల మండల అధ్యక్షుడు గుడాల వెంకటేశ్ ముదిరాజ్, గోసంరక్షణ సమితి సభ్యులు అన్నారు. మంగళవారం కులకచర్ల మండల పరిధిలోని అంతారం గ్రామంలో అక్రమంగా అనుమతి లేకుండా తరలిస్తున్న గోవులను పోలీసుల సహకారంతో పట్టుకొని ఘనాపూర్ గోశాలకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూజజ పశువులను అనుమతి లేకుండా అక్రమంగా తరలించరాదన్నారు. గోవులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గోసంరక్షణ సమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


గోవులను పట్టుకొని గోశాలకు తరలిస్తున్న గోసంరక్షణ సమితి సభ్యులు

## సమస్యలు పరిష్కరిస్తాం

బంట్వారం, జూన్ 3 : మంగళవారం మండల పరిధిలోని యాచారం, మాలసోమారం గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించగా 25 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాచారం గ్రామంలో 10, మాలసోమారం గ్రామంలో 15 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి సమస్యలు త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. బుధవారం నూరుల్లాపూర్, సుల్తాన్‌పూర్ గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.


నిర్వాహకుడు నవాజ్‌కు దేహశుద్ధి చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

## నిర్వాహకుడికి దేహశుద్ధి

వికారాబాద్. జూన్ 3.. విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కంప్యూటర్ శిక్షణ నిర్వాహకుడికి బాధిత కుటుంబ సభ్యులు దేహశుద్ధి చేశారు. మంగళవారం వికారాబాద్‌లోని బ్రెయిన్ ట్రీ కంప్యూటర్ సెంటర్లో నేర్చుకునేందుకు వచ్చిన విద్యార్థినిపై నిర్వాహకుడు నవాజ్ అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం తెలుసుకున్న విద్యార్థిని కుటుంబసభ్యులు శిక్షణ నిర్వాహకుడు నవాజ్‌కు దేహశుద్ధి చేశారు. గతంలోనూ పలుమార్లు ఆయా విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించగా.. పలువురు మందలించినా తీరు మారలేదు. బాధితులు నిర్వాహకుడు నవాజ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా స్పందించలేదు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
**డాక్యుమెంట్ పోయినది**
★ నేను, M.రవి నాయక్, S/o. నర్సింగ్ నాయక్, R/o. H.No. 13-25, పెద్దెముల్ తండా, పెద్దెముల్ మండలం, వికారాబాద్ జిల్లా, T.G. డాక్యుమెంట్ నెం. 2205/2014, 201/2013, పాస్‌బుక్ నెం. T07140190411, ఖాతా నెం. 626, సర్వే నెం. 134/అ1/3, 194/అ/1 5 ఎకరాలు గల ఒరిజినల్స్ పెద్దెముల్ తండా నుండి పెద్దెముల్ మండలానికి బైక్‌పై వస్తుండగా పడిపోయినవి. దొరికినవారు సంప్రదించండి: 9652029841.
NT-Vamshi
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.